సాక్షి చిత్తూరు

శనివారం, 20, మే, 2023



చంద్రగిరి ఐపీఎల్‌లో సిక్సర్ల మోత

తిరుపతి రూరల్: వైఎస్‌ఆర్ గ్రామీణ క్రికెట్ టోర్నమెంట్‌లో క్రీడాకారులు సిక్సర్ల మోత మోగిస్తున్నారు.

- 10లో



బండిదారిని మింగిన పచ్చనేతలు

విజయపురం(నగరి) విజయపురం మండలం ఇళ్లత్తూరులో బండిబాటను పచ్చనేతలు ఆక్రమించారు.

- 10లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	39	27
తిరుపతి	41	28
తిరుమల	36	23
గూడూరు	42	29
నగరి	42	28

న్యూస్‌రీల్

పలువురు డీఎస్పీలకు ఉద్యోగోన్నతి

చిత్తూరు అర్బన్: రాష్ట్ర పోలీసుశాఖలో పలువురు డీఎస్పీలకు ఏఎస్పీలుగా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. పోస్టింగులు కేటాయిస్తూ ఆదేశాలు వెలువడ్డాయి. చిత్తూరు ట్రాఫిక్ స్టేషన్‌లో డీఎస్పీగా పనిచేస్తున్న జె.తిప్పేస్వామిని శ్రీకాకుళం ఏఎస్పీగా, నెల్లూరు ఎస్సీ ఎస్టీ విభాగం డీఎస్పీ వైబీపీటీఏ.ప్రసాద్‌ను చిత్తూరు ట్రాన్స్‌పోర్టు ఏఎస్పీగా, తిరుపతి సీసీఎస్ డీఎస్పీ సీహెచ్.సురేష్‌ను సీఐడీ ఏఎస్పీగా, తిరుమల సీసీఎస్ డీఎస్పీ ఎల్.సుధాకర్‌ను చిత్తూరు ఏఎస్పీ (అడ్మిన్)గా నియమిస్తూ ప్రిన్స్‌పల్ కార్యదర్శి హరీష్‌కుమార్ గుప్త ఆదేశాలు జారీ చేశారు.

పటిష్టంగా వినియోగదారుల రక్షణ చట్టం

చిత్తూరు, కలెక్టరేట్: రాష్ట్ర ప్రభుత్వం వినియోగదారుల కోసం రూపొందించిన కన్జ్యూమర్ ప్రొటెక్షన్ యాక్ట్ 2019ని సమర్థవంతంగా అమలు చేసేందుకు స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం రాత్రి జేసీ చాంబర్ వద్ద ఉన్న సమావేశం మందిరంలో నోడల్ అధికారిగా జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు, కన్జ్యూమర్ వలంటీర్ ఆర్గనైజేషన్లతో జేసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కన్జ్యూమర్ ప్రొటెక్షన్ యాక్ట్ 2019పై వలంటీర్ ఆర్గనైజేషన్లు ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. పాఠశాలలు, కళాశాలలు, స్వయం సహాయక సంఘాల మహిళలతో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. తద్వారా సత్వర పరిష్కారం కోసం కన్జ్యూమర్ కమిషన్‌కు ప్రజలు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శంకరన్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

22 నుంచి కేంద్ర బృందం పర్యటన

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు కేంద్ర బృందం పర్యటిస్తుందని కలెక్టర్ షణ్మోహన్ వెల్లడించారు. శుక్రవారం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కేంద్ర జలశక్తి బృందం సభ్యులు సచిద్ర కుమార్ పట్నాయక్, డాక్టర్ సోమరేంద్ర సింగ్ పర్యటిస్తారని పేర్కొన్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని డ్వామా అధికారులను ఆదేశించారు. సభ్యుల పర్యటన నిమిత్తం రూట్ మ్యాప్‌ను సిద్ధం చేయాలని ఇందులో డ్వామా శాఖ చేపడుతున్న పనులతో పాటు ఇరిగేషన్ ఆర్‌డబ్ల్యూఎస్ సంబంధించిన పనులను గుర్తించాలన్నారు. అందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈలు విజయ్ కుమార్ రెడ్డి, శంకర్ బాబు, డీడీ గ్రౌండ్ వాటర్ గోవర్ధన్ రెడ్డి, అడిషనల్ పీడీ ఉమావాణి, ఏపీడీ సునీల్ కుమార్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఆధార్ అనుసంధానం తప్పనిసరి



మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : ఓటరు ఎపిక్ కార్డుకు ఆధార్ అనుసంధానం తప్పనిసరని కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీలు తమ బూత్ లెవల్ ఏజెంట్లను నియమించుకోవాలన్నారు. ఓటరు జాబితాకు సంబంధించి అందిన క్లెయిమ్‌లు, అబ్జెక్షన్లలను పూర్తిచేసేందుకు ఎపిక్ కార్డుకు ఆధార్ అనుసంధానం ప్రక్రియను పూర్తి చేసేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఓటరుగా నమోదు కావాలని తెలిపారు. డీఆర్‌వో ఎన్.రాజశేఖర్ పాల్గొన్నారు.

పకడ్బందీగా సర్టిఫికెట్‌ల పరిశీలన

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో ఉన్న హైస్కూళ్ల ప్లస్‌లో స్కూల్ అసిస్టెంట్‌లుగా పనిచేసేందుకు దరఖాస్తు చేసుకున్న వారి సర్టిఫికెట్లను శుక్రవారం పరిశీలించారు. అన్ని సబ్జెక్టులకు విల్లింగ్ ఇచ్చిన టీచర్ల సర్టిఫికెట్‌లను ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి సీనియర్ హెచ్‌ఎంలచే పరిశీలించినట్లు డీఈవో విజయేంద్రరావు తెలిపారు. వారందరికీ ఈనెల 20వ తేదీన ఉదయం 10 గంటలకు డీఈవో కార్యాలయంలో కౌన్సెలింగ్ ఉంటుందని డీఈవో వెల్లడించారు.



వలంటీర్లను సన్మానిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి



పాల్గొన్న వలంటీర్లు, అధికారులు, ఉద్యోగులు

సేవకు వందనం

'సూర్యుడి కిరణాలు పడకముందే అవ్వాతాతల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందిస్తున్నారు. గ్రామంలో ఏ సమస్య వచ్చినా 'మేమున్నామని' భరోసా ఇస్తున్నారు. నిజంగా మీరు జగనన్న సైనికులు. సంక్షేమ వారథులు. మీ సేవలకు వెలకట్టలేము. మీ రుణం తీర్చుకోలేనిది. నిజంగా హ్యాట్సాఫ్' అంటూ మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు వలంటీర్ల సేవలను కొనియాడారు. ఉమ్మడి జిల్లాలో శుక్రవారం 'వలంటీర్లకు వందనం' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.



ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఘనంగా వలంటీర్లకు వందనం

- 19,409 మందికి ప్రోత్సాహక అవార్డులు
- వలంటీర్ల సేవలు అమోఘం
- వారి రుణం తీర్చుకోలేనిది
- కొనియాడిన మంత్రులు, అధికారులు

చిత్తూరు కార్పొరేషన్/ తిరుపతి అర్బన్: ప్రజల ఇంటి వద్దకే పాలన అందించాలనే దృఢ సంకల్పంతో వలంటీర్ల వ్యవస్థను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చారని అటవీ, విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. చిత్తూరులోని నాగయ్య కళాక్షేత్రంలో జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం జిల్లా స్థాయి వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించగా.. దీనికి ముఖ్యఅతిథులుగా డిప్యూటీ సీఎం నారాయణ స్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హాజరయ్యారు. తొలుత మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫుడ్ స్టాల్స్‌ను సందర్శించి లైవ్‌టెలికాస్ట్ ద్వారా సీఎం ప్రసంగాన్ని వీక్షించారు. జిల్లాలో సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్రలుగా ఎంపికైన 8,408 మంది వలంటీర్లకు పురస్కారాలు అందజేశారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవరాల్లో ఈ కార్యక్రమం ఈ నెలలోపు నిర్వహించి స్థానికంగా అవార్డులను అందజేస్తారన్నారు. ప్రభుత్వం అందించే పలు పథకాలకు అర్హులను ఎంపిక చేస్తూ ప్రజల ఇంటి వద్దకే వెళ్లి సేవలందిస్తున్నారని కొనియాడారు. ప్రతి నివాసానికి వెళ్లి పథకాల పరంగా అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. మీ రుణం తీర్చుకోలేనిదన్నారు. అనంతరం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడారు. తర్వాత కారుణ్య నియామకాల కింద మొత్తం 100 మందికి ఉద్యోగ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. మేయర్ అముద, డీసీసీబీ చైర్‌పర్సన్ రెడ్డెమ్మ, రాష్ట్ర జానపద కళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కొండవీటి నాగభూషణం, పీకేఎం చైర్మన్ వెంకట్‌రెడ్డి, డీఆర్వో రాజశేఖర్, ఆర్డీఓ రేణుక, కమిషనర్ అరుణ, మెప్మా పీడీ రాధమ్మ, డీఎల్‌డీఓ రవికుమార్, ఆర్టీసీ డీసీటీఎం జితేంద్రనాథరెడ్డి, ట్రైనీ కలెక్టర్ కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి జిల్లాలో 11,001 మందికి సత్కారం

జిల్లాలో సేవా మిత్రకు 10,751, సేవారత్నకు 215, సేవా వజ్రకు 35 మొత్తం 11,001 మంది వలంటీర్లు ఎంపికయ్యారని, అందులో నేడు జిల్లా స్థాయిలో కొంత మందికి మాత్రమే పురస్కారాలు అందజేస్తున్నారని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. అనంతరం ఉత్తమ సేవలందించిన వలంటీర్లకు ప్రోత్సాహక నగదు బహుమతులు అందించారు. తిరుపతి డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, మునిసిపల్ కమిషనర్ హరిత, అడిషనల్ మున్సిపల్ కమిషనర్ సునీత, డీఎల్‌డీవోలు సుశీలాదేవి, వాణి, ఆదిశేషారెడ్డి, స్టాండింగ్ కమిటీ సభ్యుడు ఎస్‌కే బాబు, కార్పొరేటర్లు నరసింహాచారి, మునిరామిరెడ్డి, దూదికుమారి, రామాంజనేయులు, రామకృష్ణారెడ్డి, హనుమంత్‌నాయక్, కో–ఆప్షన్ సభ్యురాలు శ్రీదేవి పాల్గొన్నారు.

వలంటీర్లు.. సంక్షేమ సేవకులు

వలంటీర్లు సంక్షేమ సేవకులని రాష్ట్ర పర్యాటక, యువజన సర్వీసులశాఖ మంత్రి ఆర్కే రోజా కొనియాడారు. తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలోని శ్రీనివాస ఆడిటోరియంలో నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ల వ్యవస్థ ప్రారంభించారని, ఇచ్చిన మాటకు కట్టుబడి వరుసగా మూడో ఏడాది వలంటీర్లకు వందనం సన్మాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వలంటీర్లు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిలా పనిచేస్తున్నారని, వారి సేవలు వెల కట్టలేనివని కొనియాడారు. వలంటీర్లు అంటే జగనన్న సైనికులన్నారు. సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల ముంగిటకు తీసుకెళ్తూ సంక్షేమ సేవకులుగా గుర్తింపు పొందుతున్నారని తెలిపారు.



తిరుపతిలో వలంటీర్లను సన్మానిస్తున్న మంత్రి రోజా, కలెక్టర్, తిరుపతి కమిషనర్



కార్యక్రమానికి హాజరైన వలంటీర్లు

అది ఎంతో తృప్తినిచ్చింది



వడమాలపేట మండలానికి చెందిన పలువురు సంచార జాతుల వారికి రేషన్ కార్డులు లేవు. పక్కా గృహాలు కూడా లేవు. జగనన్న ప్రభుత్వం వచ్చిన తర్వాత.. వలంటీర్లుగా మేము గుర్తించి వారికి రేషన్ కార్డులు, ఇంటి పట్టాలు ఇప్పించాం. ఇంటి నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకున్నాం. ఇది ఎంతో సంతృప్తినిచ్చింది. – మనోజ్‌కుమార్, వడమాలపేట మండలం, వలంటీర్

సొంత బిడ్డలా భావిస్తున్నారు



సమస్యలు వస్తే వెంటనే వలంటీర్లకు కాల్ చేస్తున్నారు. సమస్య పరిష్కారమైతే వారు మమ్మల్ని సొంత బిడ్డలా చూస్తున్నారు. మేము వారి కుటుంబ సభ్యులం అయ్యాం. మరోవైపు వారి ఇంటికి వెళ్లి వృద్ధులకు ఫించన్లు ఇస్తుంటే వారి సంతోషానికి అవధులు లేవు. పేద ప్రజలకు సేవచేసే భాగ్యం కల్పించిన సీఎం జగనన్నకి కృతజ్ఞతలు. – రేవతి, వలంటీర్, తిరుపతి

పక్వానికి వచ్చిన మామిడినే కోయండి



వ్యవసాయ సలహామండలి సమావేశంలో మాట్లాడుతున్న జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ప్రస్తుత సీజన్‌లో పక్వానికి వచ్చిన మామిడి పండ్లను మాత్రమే కోసేలా ఉద్యానవన శాఖ అధికారులు అవగాహన కల్పించాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. జేసీ మాట్లాడుతూ రైతులు ఉద్యాన పంటల సాగు వైపు మొగ్గు చూపేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుతం మామిడికి గిట్టుబాటు ధర అధికంగా ఉందని చెప్పారు. వ్యవసాయ క్షేత్ర పర్యటనల ద్వారా సభ్యులకు అవగాహన కల్పించాలని తెలిపారు. రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఖరీఫ్ 2023 సీజన్‌కు సబ్సిడీ వేరుశెనగ విత్తనాలను ఈ నెలాఖరు నాటికి పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. విత్తనాలను సకాలంలో పంపిణీ అయ్యేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు.

త్వరలో మట్టి నమూనా ఫలితాలు

జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ మాట్లాడుతూ పచ్చిరొట్ట విత్తనాలు 50 శాతం సబ్సిడీతో రైతు భరోసా కేంద్రాలలో పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో 957 నమూనాలను సేకరించి మట్టి పరీక్ష కేంద్రం తిరుపతికి పంపామని, ఫలితాలు అందిన వెంటనే రైతులకు సూచిస్తామన్నారు. మండలి సభ్యులు మాట్లాడుతూ మామిడి పూత దశ నుంచి ఎక్కువగా కాయపైన బంక వచ్చి నీళ్లు కారి తెగుళ్లు ఎక్కువగా వస్తున్నాయన్నారు. శాస్త్రవేత్తలతో నివారణ చర్యలపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఏనుగుల బెడద ఉన్న ప్రాంతాలలో సోలార్ పెన్సింగ్ వేయాలని కోరారు. జిల్లా ఉద్యానవన శాఖ అధికారి మధుసూదన్ రెడ్డి, ఏపీ సీడ్స్ డీఎం సంపత్ కుమార్, జిల్లా పట్టు పరిశ్రమ శాఖ అధికారి శోభారాణి, పశుసంవర్ధక శాఖ అధికారి ప్రభాకర్, ట్రాన్స్‌కో ఈఈ హరి, పల్ప్ ప్రాసెసింగ్ యూనిట్ యజమానులు గోవర్ధన్ బాబి, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సూర్య,చంద్రప్రభలపై వేణుగోపాలుడు



సూర్యప్రభపై వేణుగోపాలుడు



చంద్ర ప్రభపై స్వామివారికి హారతి

కార్వేటినగరం: మండల కేంద్రంలో టీటీడీ అనుబంధంలో ఉన్న ప్రముఖ శ్రీరుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం పశుపాలకుడైన శ్రీకృష్ణునిగా జీవకోటికి వెలుగును ప్రసాదించే దినకరుడిపై స్వామివారు విహరించారు. రాత్రి చంద్ర ప్రభ వాహనంపై భక్తులను కటాక్షించారు. వేకువజామున 5గంటలకు సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్యపూజలు, ఆస్థానం, తదితర కార్యక్రమాలను అర్చకులు పూర్తి చేశారు. అనంతరం స్వర్ణాభరాలు, సుగంధభరిత పుష్పమాలికలు, పట్టుపీతాంబరాలతో స్వామివారిని అలంకరించి సూర్యప్రభపై కొలువుదీర్చారు. తదుపరి ఊరేగింపు నయనానందకరంగా జరిగింది. ఆలయానికి చేరుకున్న ఉత్సవర్ల సమర్పణ అనంతరం అర్చకులు దీప, ధూప, నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం 5.30 గంటలకు ఆలయ ఆవరణలో అన్నమయ్య సంకీర్తనలన నడుమ ఊంజల్ సేవ నిర్వహించారు. రాత్రి 7 గంటలకు చంద్రప్రభ వాహనాన్ని అధిరోహించి పురవీధుల్లో స్వామివారు భక్తులను కటాక్షించారు. గోవిందనామ స్మరణాలు, భజనలు, కోలాటాలు, గ్రామీణ సంప్రదాయ డ్రమ్ము వాయిద్యాల మధ్య వాహనసేవ వైభవంగా జరిగింది. భక్తులు ఇంటింటి వద్ద కర్పూర హారతులు సమర్పించారు. డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో మోహన్, సూపరింటెండెంట్ రమేష్‌బాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు రథోత్సవం..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజు శనివారం సంతాన వేణుగోపాలుడు ఉభయ దేవేరులతో రథంపై ఊరేగనున్నారు. ఉదయం 7 గంటల రథోత్సవం ప్రారంభమవుతుందని ఆలయ అధికారి సురేష్‌కుమార్ తెలిపారు. రాత్రి అశ్వవాహనంపై ఊరేగింపు ఉంటుందని పేర్కొన్నారు.

ఆయువు తీసిన వాయువు

కూలి పనులతో పూట గడిచే ఆ మూడు కుటుంబాల్లో విషవాయువు రూపంలో మృత్యువు కబలించింది. ముగ్గురు కూలీలు ఒకే సారి కన్ను మూయడం పెను విషాదాన్ని నింపింది. కుటుంబ సభ్యులు, బంధువుల ఆర్తనాదాలతో చౌడేపల్లె ప్రభుత్వాస్పత్రి దద్దరిల్లింది. మృతుల తల్లులు గుండెలవిసేలా రోదించడం.. మృతదేహాలపై పడి భార్యాపిల్లలు విలపించడం అక్కడి వారిని కలిచి వేసింది. కూలి పనులకు వెళ్లిన వారు తిరిగిరాని లోకాలకు చేరుకోవడం చౌడేపల్లె మండలం పెద్దకొండామర్రి శోకసముద్రంలో మునిగిపోయింది.

- సంపు శుభ్రం చేసేందుకు వెళ్లి ముగ్గురు కూలీల మృతి
- ఇంటి యజమానికి తీవ్ర అస్వస్థత
- శోక సంద్రంలో పెద్దకొండామర్రి



మృతుల కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

చౌడేపల్లె: చౌడేపల్లె మండలం పెద్దకొండామర్రి గ్రామంలో శుక్రవారం పనికి వెళ్లి ముగ్గురు కూలీలు ఒకే రోజు మృత్యువాతపడడం తీరని విషాదాన్ని మిగిల్చింది. సర్పంచ్ జయసుధమ్మ ఇంటి ఆవరణలో నీటి సంప్‌ను శుభ్రం చేసేందుకు వెళ్లి గ్రామానికి చెందిన బంగి రవి(42), తలారి వెంకటరమణ(35) గుర్రంకొండ మునిరాజ(32) మృతి చెందగా, సర్పంచ్ భర్త జి.నాగభూషణరెడ్డి తీవ్ర అస్వస్థతకు గురై చికిత్సపొందుతున్నాడు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం చౌడేపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పనికి వెళ్లిన వారికి ఏదో అయ్యిందని తెలియగానే కుటుంబ సభ్యులు, బంధువులు పరుగున అక్కడికి చేరుకుని గుండెలవిసేలా రోదించడం చూపరులను కంటతడి పెట్టించింది.

మంత్రి పెద్దిరెడ్డి పరామర్శ

మృతుల కుటుంబీకులను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పరామర్శించారు. ఎంపీ రెడ్డెప్ప, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డితో కలసి చౌడేపల్లె ప్రభుత్వాస్పత్రి వద్దకు వెళ్లి మృతదేహాలకు శ్రద్ధాంజలి ఘటించారు. ఆదుకుంటామని కుటుంబాలను ఓదార్చారు. తక్షణం ఆర్థిక ఆహాయం అందజేస్తామని తెలిపారు. అంత్యక్రియలకు వైఎస్సార్ బీ మా కింద రూ.10 వేల నగదును అందజేశారు. సంఘటన స్థలాన్ని పలమనేరు డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, సీఐ మధుసూధనరెడ్డి పరిశీలించారు.

ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం

చిత్తూరు కార్పొరేషన్: చౌడేపల్లె మండలం పెద్దకొండామారి గ్రామంలో నీటి సంపును శుభ్రం చేసేందుకు దిగి విషవాయువుతో ప్రమాదవశాత్తు ముగ్గురు కూలీలు మరణించడం బాధాకరమని డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విచారం వ్యక్తం చేశారు. శుక్రవారం వారు చిత్తూరులో విలేకరులతో మాట్లాడుతూ బాధిత కూలీల ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షలు పరిహారం, రూ.5 లక్షలు వైఎస్సార్ బీమా కింద అందజేయనున్నట్లు వివరించారు.



సంపు పరిశీలిస్తున్న సీఐ మధుసూదనరెడ్డి



రవి మృతదేహం వద్ద విలపిస్తున్న భార్య శశికళ, వదిన వల్లెమ్మ



మునిరాజ మృతదేహం వద్ద విషణ్ణవదనంలో తల్లి శాంతమ్మ, అత్త, భార్య



వెంకటరమణ మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య శంకరమ్మ, పిల్లలు

పకడ్బందీగా ప్రవేశ పరీక్షలు

- నేడు జిల్లాలో ఏపీఆర్ క్యాట్, ఏపీఆర్‌జేసీ, ఏపీఆర్‌డీసీ పరీక్షలు
- డీఈఓ విజయేంద్రరావు



మాట్లాడుతున్న డీఈఓ విజయేంద్రరావు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో శనివారం ఏపీఆర్ క్యాట్, ఏపీఆర్‌జేసీ, ఏపీఆర్‌డీసీ ప్రవేశ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఈవో విజయేంద్రరావు ఆదేశించారు. శుక్రవారం పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ అధికారులతో సమావేశం నిర్వహించారు. డీఈవో మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఏపీ క్యాట్‌లో 5వ తరగతి ప్రవేశానికి 632 మంది, 6వ తరగతిలో ప్రవేశానికి 383మంది, 7 వ తరగతిలో ప్రవేశానికి 230 మంది, 8వ తరగతిలో ప్రవేశానికి 187 మంది పరీక్షలు రాయనున్నారని పేర్కొన్నారు. ఏపీఆర్‌జేసీ పరీక్షకు 1862 మంది, ఏపీఆర్‌డీసీ పరీక్షకు 28 మంది దరఖాస్తులు చేసుకున్నారని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 14 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏపీఆర్ క్యాట్ పరీక్షలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఏపీఆర్ జేసీ, ఏపీఆర్‌డీసీ పరీక్షలు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయన్నారు. డీవైఈవో చంద్రశేఖర్, ఏపీఆర్‌జేసీ పరీక్షల కో ఆర్డినేటర్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కుప్పం జాతరకు రండి



మంత్రి పెద్దిరెడ్డికి ఆహ్వానపత్రిక అందిస్తున్న ఎమ్మెల్సీ, మున్సిపల్, ఆలయ చైర్మన్లు

కుప్పం: కుప్పం శ్రీప్రసన్న తిరుపతి గంగమ్మ జాతరకు రావాలని రాష్ట్ర అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఎమ్మెల్సీ భరత్, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్, ఆలయ చైర్మన్ మంజునాథ్ ఆహ్వానించారు. శుక్రవారం తిరుపతిలో మంత్రిని స్వగృహంలో కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. జాతరలో భాగంగా మంగళవారం అమ్మవారి శిరస్సు ఊరేగింపు, బుధవారం విశ్వరూప దర్శనానికి రావాలని ఆహ్వానించారు.

విద్యుత్ చౌర్యంపై దాడులు

– రూ.11.88 లక్షలు జరిమానా

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలో శుక్రవారం ట్రాన్స్‌కో 8 డివిజన్ల పరిధిలోని సర్వీసులను సాయంత్రం నుంచి రాత్రి వరకు సిబ్బంది తనిఖీ చేశారు. ఇందులో 3,227 సర్వీసులు తనిఖీ చేయగా తిరుపతి ఆపరేషన్, తిరుపతి రూరల్, పుత్తూరు, చిత్తూరు అర్బన్, చిత్తూరు రూరల్, మదనపల్లె, పీలేరు, పుంగనూరు పరిధిలో విద్యుతు చౌర్యం, అపరాధరుసుం పరంగా మొత్తం 532 సర్వీసులకు రూ.11.88 లక్షలు జరిమానా చెల్లించాలని నోటీసులు ఇచ్చినట్లు ఎస్‌ఈ కృష్ణారెడ్డి వివరించారు.

బీజేపీ పార్లమెంటు జిల్లా ఇన్‌చార్జిగా రఘురాంరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు బీజేపీ పార్లమెంట్ జిల్లా ఇన్‌చార్జిగా రఘురాంరెడ్డిని నియమిస్తూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోమువీర్రాజు ఆదేశాలు జారీచేశారు. అన్నమయ్య జిల్లాకు చెందిన రఘురాంరెడ్డి ప్రస్తుతం రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఉన్నారు.

సారా కేసులో మహిళ అరెస్ట్

వెదురుకుప్పం: సారా విక్రయిస్తున్న ఓ మహిళను వెదురుకుప్పం పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఎస్‌ఐ లోకేష్ కథనం మేరకు... మండలంలోని సీఆర్‌కండ్రిగ గ్రామానికి చెందిన వనెమ్మ సారా అమ్ముతున్నట్లు సమాచారం అందడంతో దాడి చేశారు. ఆమె వద్ద ఉన్న 8 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. ఆమెను అరెస్టు చేసి పుత్తూరు కోర్టులో హాజరుపరిచారు.

చంద్రగిరి ఐపీఎల్ క్రికెట్ టోర్నీలో సిక్సర్ల మోత



గెలుపొందిన తుమ్మలగుంట జట్టుకు బహుమతులు ప్రదానం చేస్తున్న, చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



క్రీడాకారులకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేస్తున్న హర్షిత్‌రెడ్డి

- బౌండరీలు దాటుతున్న బంతులు
- మైదానంలో క్రీడాకారుల సందడి
- క్రీడాకారులతో మమేకమైన చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని యువతలో క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీయడమే ధ్యేయంగా నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి నిర్వహించే వైఎస్సార్ గ్రామీణ క్రికెట్ టోర్నమెంట్‌లో గ్రామీణ క్రీడాకారులు సిక్సర్ల మోత మోగిస్తున్నారు. బంతులను బౌండరీలు దాటిస్తూ బౌలర్లకు చుక్కలు చూపిస్తున్నారు.

పల్లెటూరి కుర్రాళ్లు..చిచ్చరపిడుగులు

తుమ్మలగుంట వేదికగా జరుగుతున్న వైఎస్సార్ గ్రామీణ క్రికెట్ టోర్నమెంట్‌కు క్రీడాకారుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ముందుగా నిర్ణయించిన సమయానికి క్రీడాకారులు మైదానానికి చేరుకుని తమకు కేటాయించిన గ్రౌండ్లలో పోటీకి సిద్ధమవుతున్నారు. ఇరు జట్లు పోటీకి సిద్ధమవగానే చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డిలు ప్రతి క్రీడాకారున్ని పరిచయం చేసుకుని కిట్లు పంపిణీ చేస్తున్నారు. అనంతరం టాస్ వేసి ఆటను ప్రారంభం చేస్తారు. ఆ తర్వాత గెలిచిన వారికి ట్రోఫీలు ఇవ్వడం, పరాజయం చెందిన వారికి మెడల్స్, సర్టిఫికెట్ లు ఇచ్చి నిరాశ చెందవద్దని మరింత ఉత్సాహంగా ప్రాక్టీస్ చేయాలని ప్రోత్సహిస్తున్నారు.

కిక్కిరిసిన క్రీడామైదానం

చంద్రగిరి ఐపీఎల్ టోర్నీకి సందర్శకుల తాకిడి పెరిగింది. మ్యాచ్‌లను తిలకించేందుకు వందలాది మంది విచ్చేశారు. శుక్రవారం మొత్తం 13 గ్రౌండ్లలో 52 మ్యాచ్‌లను నిర్వహించగా 26 జట్లు విజయం సాధించాయి. ఒక రోజుకు ఒక్కో మైదానంలో నాలుగు మ్యాచ్‌లను నిర్వహించేలా నిర్దేశించడంతో క్రీడాకారులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. దీంతో తుమ్మలగుంట క్రీడా మైదానం ఆటగాళ్లు, ప్రేక్షకులతో నిండిపోయింది. ఎండ తీవ్రత అధికంగా ఉన్నప్పటికీ క్రీడా మైదానంలో జన సందడి తగ్గలేదు. విజేతలకు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ట్రోఫీలను అందించారు.



సెంచరి సాధించిన చంద్రశేఖర్

సిక్సర్ల మోత మోగించిన చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

చంద్రగిరి ఐపీఎల్ టోర్నీలో తుమ్మలగుంట జట్టు దుర్గసముద్రం జట్టుపై విజయకేతనం ఎగురవేసింది. తుమ్మలగుంట జట్టులో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనయుడు హర్షిత్‌రెడ్డి సిక్సర్ల మోత మోగించాడు. ఆరు సిక్స్‌లు, రెండు ఫోర్లతో 47 పరుగులు సాధించి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించి, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు సొంతం చేసుకున్నాడు. రెడ్డివారిపల్లి జట్టుతో జరిగిన పోరులో రాయల్‌పురం జట్టు 217 పరుగులు సాధించింది. జట్టులో చంద్రశేఖర్ 18 సిక్స్‌లు, మూడు ఫోర్లతో 140 పరుగులతో అజేయంగా నిలిచి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.



సిక్సర్ల మోత మోగిస్తున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

భారీగా కర్ణాటక మద్యం స్వాధీనం

గంగాధరనెల్లూరు(కార్వేటినగరం): గంగాధరనెల్లూరు ఠాణా సర్కిల్ వద్ద శుక్రవారం భారీగా కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకుని, నిందితుడిని అరెస్టు చేశారు. చిత్తూరు డీఎస్పీ శ్రీనివాసమూర్తి కథనం మేరకు .. కర్ణాట మద్యం అక్రమ రవాణాపై అందిన రహస్య సమాచారం మేరకు గంగాధరనెల్లూరు ఎస్‌ఐ రామాంజనేయులు, ఎస్‌ఆర్ పేట ఎస్‌ఐ వెంకటసుబ్బమ్మ, జీడీనెల్లూరు పోలీస్‌స్టేషన్ సిబ్బందితో ఠాణా వద్ద కాపు కాచారు. కర్ణాటక మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్న మారుతీ వ్యాన్‌ను పట్టుకున్నారు. వ్యాన్‌లో రూ. 94 వేలు విలువజేసే 3.360 టెట్రా మద్యం ప్యాకెట్లు ఉన్నాయి. మద్యాన్ని తరలిస్తున్న చిత్తూరు రూరల్ మండలం టీ.చవటపల్లి గ్రామానికి చెందిన మొగిలయ్య కుమారుడు ఎం.రూప్‌సాగర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. అలాగే అక్రమద్యం తరలింపులో భాగస్వాములుగా ఉంటున్న కర్ణాటక రాష్ట్రానికి చెందిన సతీష్, చిత్తూరు మూడవ గేటుకు చెందిన డిక్కీపై కేసు నమోదు చేసి, వారి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. ఎస్‌ఐలు రామాంజనేయులు, వెంకట సుబ్బమ్మ, గంగాధరనెల్లూరు పోలీస్ సిబ్బందికి డీఎస్పీ ప్రోత్సాహక నగదు బహుమతిని అందించారు.



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసు అధికారులు

సదుంలో వలంటీర్లకు వందనం రేపు

చిత్తూరు కార్పొరేషన్: పుంగనూరు నియోజకవర్గ స్థాయి వలంటీర్లకు వందనం కార్యక్రమం ఎంపీడీఓ కార్యాలయంలో ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అటవీ, విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విచ్చేస్తారన్నారు.

మ్యూచువల్ బదిలీలకు అనుమతి

చిత్తూరు రూరల్: జిల్లాలోని పీహెచ్‌సీలో పనిచేసున్న పారామెడికల్, స్టాఫ్ నర్సులకు మ్యూచువల్ బదిలీలకు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అర్హులైన వారు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇందు కోసం 15 రోజులు అవకాశం కల్పిస్తున్నట్లు ఉత్తర్వులో పేర్కొంది.

విరక్తితో వ్యక్తి ఆత్మహత్య

పులిచెర్ల(కల్లూరు): కల్లూరు నాలుగురోడ్ల కూడలిలో గురువారం అర్ధరాత్రి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ రవిప్రకాష్ రెడ్డి కథనం మేరకు.. పాకాల మండలం వజ్జిరిపల్లెకు చెందినజగదీష్ కుమార్ (40) ఊరూరు తిరుగుతూ ముగ్గురాళ్లు అమ్మేవాడు. తాగుడుకు బానిసై జులయిల మారి నిత్యం భార్య నవనీతతో గొడవపడేవాడు. ఇంటిని పట్టించుకునే వాడు కాదు. పలు మార్లు ఆత్మహత్యాయనికి పాల్పొడ్డాడు. భార్యతో గొడవపడి వారం రోజులుగా ఇంటికి వెళ్లడం లేదు. గురువారం కల్లూరు సంతలో ముగ్గురాళ్లు అమ్మేందుకు వచ్చాడు. అర్ధరాత్రి కల్లూరు నాలుగురోడ్ల కూడలిలో ద్విచక్ర వాహనంతో రోడ్డుపై తలకు తీవ్రంగా గాయమై కిందపడి ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. అతని షర్టు జేబులోని ఆధార్ కార్డు, ఇతర వివరాలతో భార్య నవనీతకు ఫోన్‌లో సమాచారం అందించారు. శుక్రవారం కల్లూరు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఆత్మహత్య చేసుకుని ఉంటాడని ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

భారీగా మొబైల్ ఫోన్లు స్వాధీనం

చిత్తూరు అర్బన్: జిల్లాలో చోరీకి పోగొట్టుకున్న పలు సెల్ ఫోన్లను పోలీసు శాఖ పెద్ద ఎత్తున స్వాధీనం చేసుకుంది. దాదాపు 500కు పైగా మొబైల్ ఫోన్లను అధికారులు సీజ్ చేస్తారు. దీనిపై త్వరలోనే మీడియా సమావేశం నిర్వహించనున్నారు.

బిడ్డను కాపాడండి



మాట్లాడుతున్న బిడ్డ తండ్రి.శివకుమార్

తిరుపతి కల్చరల్: గొంతు ద్వారా అమర్చిన పైపుతో శ్వాస తీసుకుంటూ ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న తమ బిడ్డకు వైద్య చికిత్స కోసం దాతలు ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని తల్లిదండ్రులు వీ.శివకుమార్, ఝాన్సీరాణి వేడుకున్నారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వారి మాటల్లోనే.. 'మాది యాదమర్రి మండలం, కీనాటంపల్లి గ్రామం. కూలిపనులు చేసుకుని బతుకులీడుస్తున్నాం. మాకు హర్షిత (3) పాప ఉంది. బిడ్డకు ఆరో నెల టీకా వేయించినప్పుడు తీవ్ర జ్వరం వచ్చింది. తర్వాత మూర్ఛకు గురైందన్నారు. అప్పటి నుంచి ప్రతి నెలా మూర్ఛతో అల్లాడి పోయేది. ఈ నేపథ్యంలో బిడ్డను కాపాడుకోవడానికి ఇప్పటివరకు రూ.12 లక్షలు ఖర్చుచేశాం. వేలూరు సీఎంసీలోనూ చికిత్స చేయిస్తున్నాం. శ్వాస తీసుకునేందుకు గొంతుకు అమర్చిన పైపు కారణంగా ఇన్ఫెక్షన్ సోకింది. ఆపరేషన్‌కు మరో రూ.6 లక్షలు ఖర్చవుతుందని డాక్టర్లు చెబుతున్నారు. అంత డబ్బు ఖర్చు చేసే స్తోమత లేక.. కళ్లెదుటే అల్లాడుతున్న బిడ్డను చూడలేక తీవ్ర ఆవేదన చెందుతున్నాము. దాతలు దయతలచి ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలి. ఆర్థిక సాయం అందించే దాతలు 8197753717ను సంప్రదించాలని విజ్ఞప్తి చేస్తున్నాము' అని తెలిపారు.

ఉద్యోగోన్నతులు కల్పించండి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో పనిచేస్తున్న వీఆర్వోలకు సీనియర్ అసిస్టెంట్‌లుగా ఉద్యోగోన్నతులు కల్పించాలని వీఆర్వో సంఘం జిల్లా అధ్యక్షులు బాలాజీరెడ్డి, ప్రధాన కార్యదర్శి పద్మనాభం కోరారు. ఈ మేరకు ఆ సంఘ నాయకులు కలెక్టర్, జేసీలకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఖాళీగా ఉన్న 12 సీనియర్ అసిస్టెంట్ పోస్టులను ఉద్యోగోన్నతుల ద్వారా భర్తీ చేయాలని కోరారు.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.62,350
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,665

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.74,000
రిటైల్ వెండి గ్రాము	రూ.77

తూకాల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు

సాక్షి, చిత్తూరు: ర్యాంప్ యజమానులు తూకాల విషయంలో ఎలాంటి అవకతవకలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ హెచ్చరించారు. శుక్రవారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఉద్యానవన శాఖ అధికారులు, ర్యాంప్ యజమానులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులతోపాటు ర్యాంపు యజమానులు బాగుండాలని ఆకాంక్షించారు. ఆ దిశగా అందరూ సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మాత్రమే తోతాపురి మామిడి రకాన్ని విక్రయించాలన్నారు. తూకంతోపాటు ధరల విషయంలో రాజీ పడేది లేదని గుర్తు చేశారు. తూకాల విషయంలో ఎలాంటి అవకతవ కలకు పాల్పడిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమిస్తే సంబంధిత ర్యాంప్‌లను సీజ్ చేస్తామన్నారు. రైతులకు ఎలాంటి నష్టం రాకుండా చర్యలు తీసు కోవాలన్నారు. ర్యాంపులపై ధర్మా రెసిస్టెంట్ షీట్‌ను ఉపయోగించాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి మధుసూదన్ రెడ్డిని కలెక్టర్ ఆదేశించారు. లీగల్ మెట్రాలజీ వారిచే అన్ని ర్యాంపుల వద్ద గల తూఖాలను తనిఖీ చేయాలన్నారు. ఈ సమావేశంలో ఉద్యానవన శాఖ అధికారులు, ర్యాంపు యజమానులు, ఇన్‌చార్జులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ షణ్మోహన్

బండిదారిని మింగేసిన పచ్చ నాయకులు

- సర్వేయర్, వీఆర్‌ఓపై టీడీపీ నాయకులు దౌర్జన్యం

విజయపురం (నగరి) : ఎన్నో ఏళ్లుగా రాకపోకలు సాగించిన బండిబాటను టీడీపీ నాయకులు అక్రమించుకున్నారు. సర్వే చేసేందుకు వెళ్లిన రెవెన్యూ సిబ్బందిపై దౌర్జన్యానికి దిగారు. విజయపురం మండలం ఇల్లత్తూరు గ్రామానికి చెందిన 108–1, 2, 5 అలాగే 115–6, 7, 8, 9 ,10, 11 సర్వే నంబర్‌లో కొత్త ఇల్లత్తూరు నుంచి పాత ఇల్లత్తూరు బండిబాట ఉంది. గత 30 ఏళ్లుగా ఇరు గ్రామస్తులు రాకపోకలు సాగిస్తున్నారు. గ్రామ దేవత కుళ్లపురమ్మ, గంగమ్మను సైతం ఊరేగింపుగా ఈ దారిలోనే తీసుకెళ్లుతున్నారు. 1996లో గ్రావెల్ రోడ్డు, 2006 రూ. 10లక్షలతో మెటల్, గ్రావెల్ రోడ్డు కూడా వేశారు. టీడీపీ నాయకులు కొందరు ఉన్నంటుండి ఈ దారిని తాము కొనుగోలు చేశానంటూ దౌర్జన్యం చేయడంతో గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. తహశీల్దార్ ఆదేశం మేరకు సర్వేయర్, వీఆర్‌వో పోలీసుల సాయంతో గురువారం సర్వే చేసేందుకు వెళ్లారు. ముందుగానే విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు సర్వేకు వచ్చిన రెవెన్యూ అధికారులను అడ్డుకొన్నారు. ఈ దారిని తాము కొనుగోలు చేశామంటూ పోలీసులతో వాగ్వాదానానికి దిగారు. దీనిపై మళ్లీ విచారణ చేస్తామని అధికారులు వెళ్లిపోయారు. 30 ఏళ్లుగా ఉన్న బండిబాటను కొనుగోలు చేయడం ఏమిటని గ్రామస్తులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి బండిబాటను సర్వే చేసి తమకు అప్పగించాలని ఇల్లత్తూరు గ్రామస్తులు కోరుతున్నారు. లేదంటే ఆందోళనలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

యువకుడిపై దాడి.. అట్రాసిటీ కేసు నమోదు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని కట్టమంచికి చెందిన దీనా అనే వ్యక్తిపై దాడిచేసి కులం పేరిట దూషించినట్లు శుక్రవారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. సీఐ భాస్కర్ కథనం మేరకు.. మంగళవారం కట్టమంచిలో గంగమ్మ జాతర నిర్వహించగా చిన్నపాటి గొడవలు జరిగాయి. కట్టమంచికి చెందిన దీనా అనే వ్యక్తి కార్యాలయంలో సీసీ కెమెరాలు చూపించాలని రాహుల్ అనే వ్యక్తి వచ్చి అడిగాడు. దీనికి అతను నిరాకరించాడు.

దీంతో రాహుల్ దాడిచేసి, కులం పేరిట దూషించాడని దీనా ఫిర్యాదులో పేర్కొన్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు రాహుల్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

శానంబట్లలో మరోసారి మంటలు!



గ్రామంలో పర్యటిస్తున్న ఎస్వీ యూనివర్సిటీ ప్రొఫెసర్లు

- అకస్మాత్తుగా కాలిపోయిన దుస్తులు
- గ్రామంలో పర్యటించిన ఎస్వీయూ కెమికల్, పర్యావరణశాఖ ప్రొఫెసర్లు
- ఇక నిరంతర నిఘా.. గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు

చంద్రగిరి (తిరుపతి రూరల్): చంద్రగిరి మండలం, కొత్తశానంబట్లలో మిస్టరీ మంటలు ఆగ డం లేదు. శుక్రవారం గ్రామానికి చెందిన వరలక్ష్మి ఇంటి ముందు బుట్టగిన్నెలో ఉంచిన దుస్తుల నుంచి అకస్మాత్తుగా మంటలు వచ్చాయి. అందరూ చూస్తుండగానే బట్టలు కాలిపో యాయి. దీంతో గ్రామస్తులు ఆందోళనకు గురయ్యారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

నెల రోజులుగా గ్రామంలో చెలరేగుతున్న మిస్టరీ మంటల మూలాలను కనిపెట్టేందుకు రెవెన్యూ, పోలీసు, పంచాయతీ అధికారులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. వారం రోజులుగా గ్రామంలోనే పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నారు. డివిజన్ స్థాయి రెవెన్యూ, పోలీస్ అధికారులు ఇప్పటికే గ్రామాన్ని సందర్శించి సమస్యపై గ్రామస్తులతో మాట్లాడారు. కొత్తగా గ్రామంలోకి ఎవ్వరు ప్రవేశించినా వారిని తనిఖీ చేసి పంపిస్తున్నారు. అయినా మంటలు మాత్రం ఆగకపోవడంతో గ్రామంలో సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేస్తున్నారు. గ్రామంలో ప్రతి వీధిలో రెండు చొప్పున 16 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.

అధికారుల పర్యటన

గ్రామంలో చెలరేగుతున్న మంటలపై శాస్త్రీయ అధ్యాయనం చేయాలని కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఆదేశించారు. దీంతో ఎస్వీ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన కెమిస్ట్రీ , పర్యావరణ విభాగం ప్రొఫెసర్లు దామోదరం, శరత్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ ఈశ్వర్‌రెడ్డితో కలిసి గ్రామంలో పర్యటించారు. మంటలు చెలరేగిన ఇళ్లల్లో బాధితులతో మాట్లాడారు. గ్రామం చుట్టూ వాతావరణ పరిస్థితులు, ఎక్కడైనా కెమికల్ రియాక్షన్ జరిగే అవకాశం ఉంటుందా...అనే అంశాలను పరిశీలించారు. కొన్ని శాంపిల్స్‌ను ల్యాబ్‌కు తీసుకెళ్తున్నట్లు ప్రొఫెసర్లు దామోదారం, శరత్‌కుమార్ తెలిపారు. పాస్పరస్ కంటెంట్ ఎక్కడైనా కలుస్తుందా..? అనే కోణంలో కూడా పరిశీలన చేస్తున్నామన్నారు.

మహిళా ఉద్యోగిపై దాడికి యత్నం?

- వేధింపుల నివారణ కమిటీకి రెఫర్ చేసిన చిత్తూరు కార్పొరేషన్ కమిషనర్

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఓ మహిళా ఉద్యోగిపై అక్కడే పనిచేస్తున్న మరో అధికారి దాడికి ప్రయత్నించారనే ఆరోపణలు గుప్పుమన్నాయి. దీనికితోడు బాధిత మహిళా ఉద్యోగి ఇది నిజమేనంటూ కమిషనర్‌కు రాత పూర్వకంగా ఫిర్యాదు చేయగా.. కమిషనర్ సైతం ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకుని శుక్రవారం విచారణకు ఆదేశించారు. ఈ ఘటనకు సంబంధించి విశ్వసనీయ సమాచారం మేరకు.. తన భర్త చనిపోతో కారుణ్య నియామకం కింద కార్పొరేషన్ కార్యాలయంలోని ప్రజారోగ్య విభాగంలో ఓ మహిళా ఉద్యోగి పనిచేస్తున్నారు. ఇక్కడున్న ఓ అధికారి రెండు రోజుల క్రితం మహిళా ఉద్యోగిని యూనిఫాం ఎందుకు వేసుకురాలేదని ప్రశ్నించారు. కుట్టడానికి ఇచ్చానని చెప్పడంతో, ఆగ్రహం చెందిన అధికారి ఆఫీస్ నుంచి బయటకు వెళ్లాలని ఆదేశించాడు. తనపై ఎందుకు అరుస్తున్నారని మహిళ ప్రశ్నించడంతో సహనం కోల్పోయిన అధికారి, మహిళా ఉద్యోగిని కొట్టడానికి వెళ్లారు. దీంతో అక్కడే ఉన్న పలువురు అధికారిని పట్టుకోవడంతో మహిళ భయపడి ఏడుస్తూ పరుగులు పెట్టారు. దీనిపై సంబంధిత మహిళా ఉద్యోగిని, ఆ అధికారిపై రాతపూర్వకంగా కమిషనర్‌కు ఫిర్యాదుచేశారు. ప్రజారోగ్య శాఖలో ఇద్దరు పురుషులు అటెండర్లుగా ఉన్నా కూడా, నిత్యం తనను పిలిపించి టిఫిన్ వడ్డించాలని, భోజనం వడ్డించాలని వేధింపులకు గురిచేసేవాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. యూనిఫాం లేదనే సాకుతో అందరి ముందు తనపై దాడికి ప్రయత్నించాడని, భయపడి పారిపోతే.. మళ్లీ పిలిపించి షోకాజు నోటీసు ఇచ్చారని కమిషనర్ ముందు మహిళ వాపోయారు. ఈ వ్యవహారంపై కమిషనర్ స్పందిస్తూ మహిళ ఫిర్యాదును కార్యాలయంలో ఏర్పాటు చేసిన మహిళా ఉద్యోగులపై వేధింపుల నివారణ కమిటీకు రెఫర్ చేశారు. జరిగిన విషయాలు కమిటీ ముందు చెప్పాలని, కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని మహిళా ఉద్యోగికి కమిషనర్ భరోసా ఇచ్చారు.